

ఆత్మీయ స్వాగతం.. వీడ్కోలు

రేణిగుంట ఎయిర్‌పోర్టులో ముఖ్యమంత్రికి మంత్రులు, ప్రజాప్రతినిధులు ఆత్మీయ స్వాగతం.. వీడ్కోలు పలికారు. - 8లో



అభివృద్ధిని అడ్డుకుంటే..

తిరుపతి అభివృద్ధిని అడ్డుకుంటే చరిత్రహీనులుగా మిగిలిపోతారని నగర వాసులు హెచ్చరించారు. - 8లో



వైభవం.. కుంభాభిషేకం

తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీలోని ధనకోటి గంగమ్మ ఆలయంలో కుంభాభిషేకం నిర్వహించారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. స్పందనకు అన్ని శాఖల ఉన్నతాధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. అర్జీలు రాసేందుకు ప్రత్యేకంగా ముగ్గురు వీఆర్‌ఓలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ క్రమంలోనే జిల్లాలోని అన్ని వార్డు, గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజూ సాయంత్రం తప్పనిసరిగా స్పందన కార్యక్రమం నిర్వహించాలని స్పష్టం చేశారు.

ఉద్యోగుల సంక్షేమానికే ప్రాధాన్యం



ఎంపికైన కార్యవర్గం

తిరుపతి కల్చరల్: మల్టీపర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్రంలోని ఉద్యోగుల సంక్షేమానికే ప్రాధాన్యమిస్తూ నిరంతరం కృషి చేస్తోందని సంఘం చైర్మన్ పి.పురుషోత్తంరెడ్డి తెలిపారు. ఆదివారం తిరుపతిలోని యూత్ హాస్టల్‌లో సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా మద్దూరు నరసింహ ప్రసాద్, అసోసియేటెడ్ అధ్యక్షుడిగా గాజంపాల రత్నాకర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.కృష్ణంరాజు, కోశాధికారిగా కరణం రమేష్‌బాబు, ఉపాధ్యక్షుడిగా వెంకటేశులు, సంయుక్త కార్యదర్శిగా నాగార్జునసాగర్, సామాజిక మాధ్యమ కార్యదర్శిగా బాలసుబ్రమణ్యంతో పాటు 27 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా కె.శివయ్య వ్యవహరించారు.

కులగణన ప్రాంతీయ సదస్సు రేపు

తిరుపతి అర్బన్ : తిరుపతి శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీలోని ప్రియదర్శిని ఆడిటోరియంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు కులగణన ప్రాంతీయ సదస్సు ప్రారంభించనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నేతలు, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, మేధావులు పెద్దసంఖ్యలో సదస్సుకు హాజరై తమ అమూల్యమైన సలహాలు, సూచనలు అందించాలని కోరారు. సదస్సు నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారులను ఆదేశించారు.

ఆగమోక్తం ఆకాశదీపం



కార్తీక దీపానికి పూజలు చేస్తున్న అర్చకులు, పూనం మాలకొండయ్య

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ఆకాదీపాన్ని ఆగమోక్తంగా వెలిగించారు. ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రతి రోజూ ఆకాశదీపాన్ని సాంప్రదాయబద్ధంగా వెలిగిస్తుంటారు. పౌర్ణమి సందర్భంగా ఆలయంలోని ఊంజల్‌సేవ మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. అడిషనల్ చీఫ్ సెక్రటరీ పూనం మాలకొండయ్య, ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో కేఎస్ రామారావు, పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకోవడానికి సమయం 6 గంటలు పడుతోంది. అరుణాచలం, శబరిమల వెళ్లే భక్తులు స్వామివారి దర్శనార్థం భారీగా తరలిరావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవు దినం కావడం, తమిళనాడులోని అరుణాచలంలో గిరిబలం(కొండ ప్రదక్షిణ)కు వెళ్లే భక్తులు, అలాగే కార్తీక మాసంలో మండల దీక్ష పూర్తి చేసుకున్న అయ్యప్ప భక్తులు, సామాన్య భక్తులు స్వామివారి దర్శనార్థం తరలిరావడంతో రూ.150, రూ.100 క్యూలైన్లు అన్నీ భక్తులతో నిండిపోయి ఆరుబయట వరకు బారులు తీరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుని భక్తులకు దర్శనం కల్పించారు.

అపూర్వ స్వాగతం

సాక్షి తిరుపతి/ రేణిగుంట: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం రాత్రి తిరుమల పర్యటన నిమిత్తం జిల్లాకు విచ్చేశారు. ప్రధానికి రేణిగుంట విమానాశ్రయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ క్రమంలో ముందుగా సాయంత్రం ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ముఖ్యమంత్రికి మంత్రులు.. ప్రజాప్రతినిధులు.. అధికారులు సాదర ఆహ్వానం పలికారు. సీఎం వెంట విమానంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వచ్చారు. ప్రధానమంత్రి తిరుమలకు బయలుదేరిన తర్వాత ముఖ్యమంత్రి విజయవాడకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు విమానాశ్రయంలో ఘనంగా వీడ్కోలు ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టీటీడీ బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, గురుమూర్తి, ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కోనేటి ఆదిమూలం, వరప్రసాద్‌రావు, వెంకటేగౌడ, ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు బల్లి కల్యాణచక్రవర్తి, చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేసీ బాలాజీ, ఎస్పీలు పరమేశ్వర్‌రెడ్డి, అన్బురాజన్, తిరుపతి మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, కార్పొరేషన్ కమిషనర్ హరిత, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ఆర్డీఓలు రవిశంకర్‌రెడ్డి, నిశాంత్‌రెడ్డి, చంద్రముని తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన కోసం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌కు సాదర ఆహ్వానం అందించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.



ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మెమెంటో అందిస్తున్న సీఎం వైఎస్ జగన్, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్



అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

నేడు శ్రీవారిని దర్శించుకోనున్న ప్రధాని

తిరుమల: రేణిగుంట ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గాన భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం రాత్రి తిరుమల చేరుకున్నారు. శ్రీరచనా అతిథిగృహం వద్ద ఈఓ ధర్మారెడ్డి, రచనా టెలివిజన్ డైరెక్టర్ తుమ్మల రచనా స్వాగతం పలికారు. సోమవారం ఉదయం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు.



ప్రధానికి స్వాగతం పలుకుతున్న మంత్రులు, ఎంపీలు



ముఖ్యమంత్రితో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు





ప్రధానితో కరచాలనం చేస్తున్న ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

ఆగమోక్తంగా అంకురార్పణ



రాపూరు : పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీ నసింహస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించనున్న ఏకోత్తర సహస్ర కలశాభిషేకానికి ఆదివారం రాత్రి ఆగమోక్తంగా అంకురార్పణ చేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీవారికి విశేష అభిషేకం జరిపించనున్నారు. ఈ నేపథ్యంలో నందనవనం నుంచి పుట్టమన్ను సేకరించి ఆలయ అలంకార మండపంలో నవధాన్యాలకు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఉభయదేవేరీ సమేత నృసింహస్వామివారికి 1001 కలశాల పవిత్ర జలాలు, విశేష అమృతాలతో అభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. సాయంత్రం వైభవంగా క్షేత్రోత్సవం జరిపించనున్నట్లు వివరించారు.

ముక్కంటి సేవలో విదేశీయులు



రష్యా భక్తులతో ఈఓ రామారావు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం సుమారు 15 మంది రష్యా దేశస్థులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ వేద పండితులు వారిని ఆశీర్వదించగా.. అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు. ఆలయ ప్రాశస్త్యాన్ని ఈవో కేఎస్ రామారావు వారికి వివరించారు.

శాస్త్రోక్తం.. చుక్కాని ఉత్సవం



చుక్కాని వెలిగిస్తున్న అంజూరు శ్రీనివాసులు, తదితరులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం శాస్త్రోక్తంగా చుక్కాని ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం పెద్దనంది వద్ద తాటిచెట్టు నిలబెట్టి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి అమ్మవారి ఆలయం నుంచి బాల దీపాలను ఊరేగింపుగా తీసుకువచ్చి చుక్కాని వెలిగించారు. విశేష వేడుకను వీక్షించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈఓ కేఎస్ రామారావు, వైఎస్సార్‌సీపీ నేత బియ్యపు పవిత్రారెడ్డి పాల్గొన్నారు.



దేదీప్యంగా జ్వాలాదీపం

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.06 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది.

28 వరకు పీజీ అడ్మిషన్లు

తిరుపతి సిటీ : తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో పీజీ అడ్మిషన్లకు గడువును ఈ నెల 28వ తేదీ వరకు పొడిగించినట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ శ్రీమురళి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి రెండవ, చివరి విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించామని, 28 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కొనసాగించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు డీఓఏ కార్యాలయంలో విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో రిపోర్టు చేయాలని సూచించారు.

దివ్యతేజం







కార్తీక పౌర్ణమి.. కృత్తికా నక్షత్రం సందర్భంగా జిల్లాలోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. దేదీప్యమానంగా కార్తీక దీపాలు వెలిగించారు. స్వామి, అమ్మవార్లను సేవించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ముఖ్యంగా తిరుమల శ్రీవారి ఆలయంలో విశేషంగా దీపోత్సవం నిర్వహించారు. తిరుపతి కపిలతీర్థంలోని శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలో మహిళలు దివ్యదీపారాధన చేపట్టారు.

- తిరుపతి కల్చరల్, తిరుమల

అద్భుతంగా తిరునగరి అభివృద్ధి

- నవీన తిరుపతి నిర్మాణమే లక్ష్యం
- ఆరోపణలు.. విమర్శలను పట్టించుకోం
- టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన



శిలాఫలకం ఆవిష్కరణలో జీయర్‌స్వాములు, టీటీడీ చైర్మన్ భూమన తదితరులు



రహదారిని ప్రారంభిస్తున్న జీయర్‌స్వాములు, టీటీడీ చైర్మన్ భూమన, మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు అభినయ్‌రెడ్డి, ముద్ర నారాయణ

తిరుపతి తుడా : ఆధ్యాత్మిక క్షేత్రం తిరునగరిని అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నామని, నవీన తిరుపతే లక్ష్యంగా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని టీటీడీ బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం నగరంలోని తిలక్‌రోడ్డు నుంచి జబ్బార్ లేఅవుట్ మీదుగా నూతనంగా నిర్మించిన బూపిరాట్టి మార్గాన్ని తిరుమల పెద్ద జియ్యంగార్, చిన్న జియ్యంగార్‌తో కలిసి ప్రారంభించారు. భూమన మాట్లాడుతూ తిరుపతి అభివృద్ధిని అడ్డుకునేందుకు కొన్ని దుష్టశక్తులు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. అయితే ఎన్ని ఆరోపణలు, విమర్శలు ఎదురైనా రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. తిరుపతిని దేశంలోనే అత్యద్భుత నగరాలలో ఒకటిగా తీర్చిదిద్ది తీరుతామని తెలిపారు. అభివృద్ధిని అడ్డుకుంటున్నవారు చరిత్రహీనులుగా మిగిలిపోతారన్నారు. శ్రీరామానుజాచార్యులవారి మాతృమూర్తి భూపిరాట్టి పేరును ఈ రహదారికి నామకరణం చేయడం ఆనందంగా ఉందని వెల్లడించారు. అధ్యాత్మిక, చారిత్రక విశిష్టతను చాటేలా రహదారులకు మహనీయుల పేర్లు పెడుతున్నామన్నారు. మేయర్ శిరీష, కమిషనర్ హరిత మాట్లాడుతూ నగర ప్రజలకు అత్యాధునిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త తిరుపతిని ఆవిష్కరించే దిశగా రాజీలేని నిర్ణయాలు తీసుకుంటున్నామన్నారు. రహదారుల అభివృద్ధితో నగరానికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, మరో 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్ అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్లు తాజీన్ వంశీ, రామస్వామి వెంకటేశ్వర్లు, మునిరామిరెడ్డి, నరసింహాచారి, తాళ్లూరి రత్నకుమారి, కో–ఆప్షన్ సభ్యులు రుద్రరాజు శ్రీదేవి, ఎస్‌ఈ మోహన్, ఎమ్‌ఈ చంద్రశేఖర్, హెల్త్ ఆఫీసర్ యువఅన్వేష్, వైఎస్సాఆర్‌సీపీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్‌రెడ్డి, నాయకులు ఉదయ్ వంశీ, దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, తులసీయాదవ్, తలారి రాజేంద్ర, బాలిశెట్టి కిషోర్, నాగిరెడ్డి, సునీల్ చక్రవర్తి, తొండమనాటి వెంకటేశ్వరెడ్డి, ప్రసాద్ రాజు, మునిరామిరెడ్డి, దూది శివరాయల్, కొల్లి రఘురామరెడ్డి, పసుపులేటి రవి, దేవదానం, గీతా యాదవ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా పల్స్ రెస్టారెంట్ వార్షికోత్సవం


కస్టమర్లకు బహుమతులు అందిస్తున్న రెస్టారెంట్ అధినేతలు

తిరుపతి కల్చరల్ : తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని పల్స్ రెస్టారెంట్ 6వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెస్టారెంట్ అధినేతలు వి.సతీష్‌రెడ్డి, వి.జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో కస్టమర్లకు టీషర్టులు, పిల్లలకు బొమ్మలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పల్స్ రెస్టారెంట్‌తో పాటు ఏపీఎస్పీడీసీఎల్ సమీపంలోని తమ బ్రాంచ్ పల్స్ గ్రామీణ బిర్యానీ రెస్టారెంట్‌ని కూడా ఆదరిస్తున్న నగర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. వార్షికోత్సవ కానుకగా రెండు రోజుల పాటు 10 శాతం రాయితీ కల్పిస్తున్నామని, అలాగే ఈ నెల 30వ తేదీ వరకు స్విగ్గీలో ప్రత్యేక ఆఫర్స్ అందిస్తున్నట్లు వివరించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సైదాపురం : మండలకేంద్రంలోని ఆస్పత్రి సమీపంలో పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. నలుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.3,520 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చల్లా వాసు తెలిపారు.


ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి


స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి


సత్కరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన

ఆత్మీయ స్వాగతం.. వీడ్కోలు

తిరుమల పర్యటనకు విచ్చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి సాదర ఆహ్వానం పలికేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం సాయంత్రం రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఆయనకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం విజయవాడకు బయలుదేరిన ముఖ్యమంత్రికి సాదర వీడ్కోలు ఇచ్చారు. - రేణిగుంట


అభివాదం చేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి


పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీ గురుమూర్తి





సీఎం వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కల్యాణచక్రవర్తి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి




అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ మురళీధర్, పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యేలు ఆదిమూలం, వరప్రసాద్‌రావు



కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

వైభవం.. కుంభాభిషేకం

- ధనకోటి గంగమ్మ సేవలో తుడా చైర్మన్


అమ్మవారిని దర్శించుకుంటున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : గాంధీపురం పంచాయతీ శ్రీనగర్ కాలనీలోని ధనకోటి గంగమ్మ ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు పొంగళ్లు పొంగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ క్రమంలో తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన మాట్లాడుతూ గంగమ్మ ఆలయాభివృద్ధికి మరింత తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సర్పంచ్ లక్ష్మీసెల్వం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ మేరకు మూడు రోజుల పాటు ప్రాతఃకాల పూజ, దీక్ష హోమం, ప్రతిష్ఠ హోమం, యంత్ర విగ్రహ కలశం, వినాయక స్వామి, సుబ్రమణ్యస్వామి, పోతురాజు స్వామి వార్ల శిఖర, ప్రతిష్ఠాపన, ప్రాణ ప్రతిష్ఠ, పూర్ణాహుతి తదితర క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రంగారెడ్డి, మాస్ అధ్యక్షుడు జ్ఞానశేఖర్‌రెడ్డి, మధు పాల్గొన్నారు.

కృష్ణవేణికి జాతీయ పురస్కారం


అవార్డు అందుకుంటున్న డాక్టర్ కృష్ణవేణి

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ వీ. కృష్ణవేణికి ఒంగోలు కళా మిత్రమండలి జాతీయ ప్రతిభా పురస్కారాన్ని ప్రకటించింది. ఆదివారం ప్రముఖ సినీ గేయ రచయిత శ్రీ భువనచంద్ర చేతుల మీదుగా ఆమె ఒంగోలులో ఈ అవార్డును స్వీకరించారు. తెలుగు సాహిత్యం, కళా రంగానికి ఆమె చేస్తున్న కృషికి ఈ అవార్డును ప్రకటించినట్టు కళామిత్ర మండలి అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు తెలియచేశారు. కమిటీ చైర్మన్ తేళ్ల అరుణ పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మహిదేవమ్మ, అధ్యాపకులు కృష్ణవేణిని అభినందించారు.

తెప్పపై కల్యాణ వేంకటేశ్వరుని దివ్య దర్శనం


తెప్పపై విహరిస్తున్న కల్యాణ వెంకన్న

నారాయణవనం: కల్యాణ వెంకన్న ఆలయంలో కార్తీక తెప్పోత్సవాల్లో చివరి రోజు ఆదివారం సాయంత్రం పద్మ సరస్సులో తెప్పపై ఉభయదేవేరీ సమేతంగా శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు కల్యాణ మండపంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం కైంకర్యాలను నిర్వహించి అర్చకులు తిరుచ్చి వాహనంపై ఉత్సవ మూర్తులను అలంకరించి కొలువుదీర్చారు. మేళతాళాలు, భక్తుల కోలాటాల నడుమ ఊరేగింపు ప్రారంభమైంది. సన్నిధి వీధిలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద సురాపాన దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వీధుల్లో ఉత్సవమూర్తులు ఊరేగుతూ పద్మసరస్సుకు వేంచేపు చేశారు. పద్మసరస్సులో జలాలకు సంప్రోక్షణ తదితర పూజలను నిర్వహించి విద్యుత్ దీపాలతో, పచ్చటి మామిడి తోరణాలతో సుందరంగా అలంకరించిన తెప్పపై ఉత్సవర్లను అధిష్ఠింప చేశారు. సరస్సులో తెప్పపై ఐదు ప్రదక్షిణలతో జల విహారం చేసిన ఉత్సవమూర్తులు ఆలయానికి చేరుకుని ఆస్థానంలో పాల్గొన్నారు. ధూప దీప నైవేద్యాలను సమర్పించిన అర్చకులు ఏకాంత సేవ నిర్వహించారు. ఇన్‌చార్జి డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ పార్థసారథి, ఆలయ అధికారి నాగరాజు, భద్రతా జమేదార్ రాజశేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా కార్తీక పౌర్ణమి దీపోత్సవం



నాగలాపురం: మండలంలో సురుటుపల్లెలోని శ్రీ పల్లికొండేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం కార్తీక పౌర్ణమి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత ఉదయం 5 గంటలకు స్వామి అమ్మవార్లకు పంచామృత మహాభిషేకం, 11 గంటలకు శ్రీ వాల్మీకి స్వామికి రుద్రాభిషేకం చేశారు. సాయంత్రం 5 గంటలకు అమ్మవార్లకు అభిషేకం అనంతరం భక్తులు ఆలయ ప్రాకారంలో దీపాలు వెలిగించారు. స్వామి అమ్మవార్లకు వృషభ వాహనంపై ఆలయ ప్రాకారంలో విహరించారు. రాజగోపురం ముందు అలయ అర్చకులు జ్వాలాతోరణం వెలిగించారు. రంగురంగుల పుష్పాలతో శివలింగం, నందీశ్వర స్వామికి దీపాలు వెలిగించడంతో సరికొత్త శోభ సంతరించుకుంది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజి రెడ్డి, కార్య నిర్వహణాధికారి కె.రామచంద్రా రెడ్డి, పాలక మండలి సభ్యులు ఆనంద్, మునివేలు, సత్యరమేష్, ప్రత్యేక ఆహ్వానితులు రాధాకృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటలపై ఏనుగుల దాడి


ధ్వంసమైన కొబ్బరి చెట్లు

పాకాల: మండలంలోని దామలచెరువుకు ఆనుకుని ఉన్న యల్లం పల్లె సమీపంలోని పంటలపై ఏనుగులు దాడి చేసి నష్టం కలిగించిన సంఘటన ఆదివారం వేకువ జామున చోటు చేసుకుంది. వివరాలు.. తెల్లవారుజామున సుమారు 3 గంటల ప్రాంతంలో మామిడి తోటల్లో ఏనుగుల సంచరించాయి. రామ్మూర్తిరెడ్డికి చెందిన మూడేళ్ల కొబ్బరి చెట్లను ధ్వంసం చేశాయి. సుమారు 60 నుంచి 70 చెట్ల వరకు ఏనుగులు నాశనం చేశాయని బాధిత రైతు కన్నీటిపర్యంతమయ్యాడు. అటవీ అధికారులు పంట నష్టపరిహారం ఇవ్వాలని కోరాడు.

బాలాజీ తిరుపతి జిల్లా గౌడ సంఘం సర్వసభ్య సమావేశం


సమావేశమైన గౌడ సంఘం సభ్యులు

శ్రీకాళహస్తి: స్థానిక గౌడ సంఘం కార్యాలయంలో ఆదివారం శ్రీబాలాజి తిరుపతి జిల్లా గౌడసంఘం సర్వసభ్య సమావేశం చైర్మన్ ఈశ్వర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా గౌడ సభ్యులు హాజరయ్యారు. పలు అంశాలపై మాట్లాడారు. గూడూరు సమీపంలోని తాళ్లమ్మ ఆలయం వద్ద డిసెంబర్ 10న కార్తీక వనమహోత్సవం నిర్వహించనున్నామని, దీనిని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా తిరకాల పురుషోత్తం గౌడ్ ఏకగ్రీకంగా ఎన్నికయ్యారు. సహాధ్యక్షులుగా ఉదయగిరి మోహన్‌గౌడ్, చిట్టం శ్రీనివాస్‌గౌడ్, కేతి నారాయణస్వామి గౌడ్, బుస రాజశేఖర్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో భాస్కర్ గౌడ్, నాగేశ్వరరావు, ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే చరిత్ర హీనులే


తప్పుడు కథనాలు రాసిన పత్రికలను దహనం చేస్తున్న నగరవాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు


వాటర్ ట్యాంక్‌పై నుంచి నిరసన తెలుపుతున్న స్థానికులు, యువకులు

తిరుపతి తుడా: నగరాభివృద్ధిని అడుకుంటే చరిత్ర హీనులుగా మిగిలిపోతారని నగరవాసులు ఆరోపించారు. ఆదివారం స్థానిక ఎమ్ఆర్ పల్లి దండిమార్చ్ కూడలి వద్ద తిరుపతి అభివృద్ధిపై విషం కక్కుతూ నిరాధార ఆరోపణలతో వార్తలు ప్రచురించిన పచ్చ పత్రికలను తగులబెట్టారు. వీరితోపాటు స్థానిక వైఎస్ఆఆర్ సీపీ నాయకులు నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 19వ డివిజన్ కార్పొరేటర్ ఆరణి సంధ్య మాట్లాడుతూ నగరాభివృద్ధిని అడ్డుకోవడం బాధాకరమన్నారు. గతంలో ఎప్పుడూ చూడని విధంగా తిరుపతి రూపురేఖలు మారేలా ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి అభివృద్ధి చేసి చూపించారన్నారు. నిరాధార ఆరోపణలు, పర్సంటేజీల పేరుతో అవమానించేలా కథనాలు రాయడం బాధాకరమన్నారు. శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతి అభివృద్ధిలో టీటీడీని భాగస్వామ్యం చేయడం ఎంతో అవసరమన్నారు. అభివృద్ధిని అడ్డుకునేందుకు కోర్టులకు వెళ్లడం, అక్కడ వచ్చే ఆర్డర్లతో మీడియాలో కనిపించేదుకు ప్రయత్నించడం కొందరు అలవాటు చేసుకున్నారని ఆరోపించారు. స్థానిక నాయకులు మబ్బు నాదమునిరెడ్డి, కుమార్, చంద్ర, మాకం చంద్ర, సోమశేఖర్‌రెడ్డి, జీవరత్నం, కిరణ్‌కుమార్, సోము, రమేష్ పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్‌పై నిరసన అడ్డుకున్న పోలీసులు

నగరాభివృద్ధిని అడ్డుకునేందుకు కుయుక్తులు పన్నుతున్న చోటా నాయకులను వ్యతిరేకిస్తూ నగర యువత ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. ఆదివారం స్థానిక ప్రకాశం పార్కులోని ఓవర్‌హెడ్ ట్యాంక్ పైకి ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. అలిపిరి పోలీసులు, పౌరహక్కుల సంఘం నేతలు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. బీఆర్ఎస్ నాయకుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అభివృద్ధికి కృషి చేయాలే తప్ప అడ్డుకునేందుకు యత్నించడం సిగ్గుచేటన్నారు.

సర్పం శిరస్సుపై త్రిశూలం గుర్తులు



తొట్టంబేడు (శ్రీకాళహస్తి): శిరస్సుపై త్రిశూలం గురుతులు ఉన్న ఓ పాము ఆదివారం తిరుపతి జిల్లా, శ్రీకాళహస్తి నియోజకవర్గం, తొట్టంబేడు పంచాయతీ, ఎస్సీ కాలనీ వద్ద దర్శనమిచ్చింది. కార్తీక మాసంలో.. అదీ కార్తీక పౌర్ణమి రోజున త్రిశూలం గురుతులు ఉన్న పాము కనిపించడంతో స్థానికులు ఇదేదో దైవలీలగా భావించి పూజలు చేయడం ప్రారంభించారు. కొంతసేపు ఆగిన ఆ పాము ఆపై అక్కడి నుంచి పొదల్లోకి వెళ్లిపోయింది. ఆ పాము పూర్వపరాలు తెలియరాలేదు.

గల్లంతైన యువకుడి కోసం గాలింపు


గాలింపు చర్యల్లో పోలీసులు

వాకాడు : మండలంలోని తూపిలిపాళెం వద్ద సముద్రంలో శనివారం గల్లంతైన యువకుడి కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. వివరాలు.. ఓజిలి మండలం రాజుపాళెం గ్రామానికి చెందిన రుషిక్ తన నలుగురు స్నేహితులతో కలసి ఆటోలో తూపిలిపాళెం బీచ్‌కు వచ్చాడు. స్నానం చేస్తున్న క్రమంలో అలల తాకిడికి గల్లంతయ్యాడు. వెంటనే స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అప్పటి నుంచి కుటుంబీకులతోపాటు పోలీసులు, మత్స్యకారులు, మెరైన్ సిబ్బంది గాలిస్తున్నా ఇప్పటికీ యువకుడి ఆచూకీ తెలియలేదు. ఆదివారం మధ్యాహ్నం రుషిక్ మృతదేహం ఒడ్డుకు కొట్టుకువచ్చిందని, మళ్లీ సముద్రంలోకి వెళ్లిపోయిందని స్థానిక మత్స్యకారులు వెల్లడించారు. దీంతో పోలీసులు గజఈతగాళ్లను రప్పించి బోట్లలో సముద్రంలోకి వెళ్లి గాలించినా ప్రయోజనం లేకుండా పోయింది. సోమవారం ఉదయం నుంచి గాలింపు చర్యలను కొనసాగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళల కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక


ఎంపికైన జట్టుతో క్రీడా సంఘాల నేతలు

తిరుపతి సిటీ : ఎస్వీయూలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం ఉమ్మడి జిల్లా మహిళల కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ సయ్యద్ సాహెబ్ ఆధ్వర్యంలో చేపట్టిన పోటీలకు మొతకతం 36మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరచిన 12 మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. వీరిలో రేణిగుంటకు చెందిన సోనీ, ఎస్వీయూ నుంచి సీహెచ్ ఎగోమి, తులసి, మైనా. శాంతి, అపర్ణ, మజూష, తిరుపతి నుంచి లిఖిత, పద్మావతి మహిళా కళాశాల నుంచి పుష్పలత, నాగలాపురానికి చెందిన నందిని, నక్షత్ర, కార్వేటినగరానికి చెందిన కవిత ఉన్నారు. ఎంపికైన జట్టు ఈనెల 29 నుంచి కర్నూలు జిల్లా గోనెగుండ్లలో జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మమత, రవీంద్రరెడ్డి, సెలక్షన్ కమిటీ మెంబర్లు కృష్ణ, సుమన్, తిరుపతి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ శ్రీధర్, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి స్మగ్లర్ల అరెస్ట్


స్వాధీనం చేసుకున్న గంజాయితోపాటు నిందితుల అరెస్ట్ చూపుతున్న సెబ్ అధికారులు

గూడూరురూరల్ : చిల్లకూరు మండలం బూదనం టోల్‌ప్లాజా వద్ద గంజాయి తరలిస్తున్న ఇద్దరు స్మగ్లర్లను సెబ్ అధికారులు అరెస్ట్ చేశారు. ఆదివారం టూటౌన్‌లోని సెబ్ కార్యాలయంలో సీఐ విజయ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఒడిశాకు చెందిన సూర్య, హేమలత కర్ణాటకలోని కోలార్ వద్ద ఇటుక బట్టీలో పనిచేసేవారు. అక్కడి కూలీలకు ఉన్న గంజాయి అలవాటును సొమ్ము చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఒడిశాలోని సింధూరం డాంగ్ అటవీప్రాంతం నుంచి గంజాయి కొనుగోలు చేసి కోలార్‌లో విక్రయించేవారు. గతంలో వారు ఇదే కేసుల్లో జైలుకు కూడా వెళ్లి వచ్చారు. ఈ క్రమంలో వారు బస్సులో గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సెబ్ అధికారులు వాహనాల తనిఖీ చేపట్టగా పట్టుబడ్డారు. నిందితుల నుంచి రూ.3లక్షల విలువైన 10 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు సీఐ వివరించారు. తనిఖీల్లో ఎస్ఐ శేషమ్మ, హెడ్‌కానిస్టేబుల్ కిరణ్‌సింగ్, సిబ్బంది గౌస్‌బాషా, రామ్‌ప్రసాద్, రమేష్, ఆనంద్‌బాబు, రాఘవయ్య, ప్రసాద్, కృష్ణయ్య పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

దొరవారిసత్రం : మండలంలోని వేణుంబాకం సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున జరిగిన ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. సూళ్లూరుపేట వైపు నడిచి వెళుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.